సాక్షి
నంద్యాల
సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



విజ్ఞానం.. వినోదం

వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని శాఖ గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నారు.

8లో ▸



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై ఆదివారం హైదరాబాద్‌కు చెందిన సాఖ్య నృత్యకళానికేతన్ వారి సంప్రదాయ నృత్యం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



వీరభద్రుడికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర పాలకుడైన బయలువీరభద్రస్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా 26 మంది భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

శ్రీశైలంలో భక్తుల సందడి



దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవుల నేపథ్యంలో భక్తుల తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొంది స్వామివారి స్పర్శదర్శనం చేసుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

గోస్పాడు: కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఉదయం 9.30 ప్రారంభించి మధ్యాహ్నం 12.30 గంటలకు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాల(వ్యవసాయం): డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 11 నుంచి 12.00 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర రావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు, ప్రజలు తమ సమస్యలను, సలహాలు, సూచనలను 9505065651 నంబరుకు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు.

ముమ్మరంగా కార్డన్ సర్చ్

- అనుమానిత ప్రాంతాల్లో సోదాలు
- 49 వాహనాలు సీజ్



నంద్యాల పట్టణం దేవనగర్‌లో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసుల బృందాలు కార్డన్ సెర్చ్ చేపట్టారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు రౌడీ షీటర్లు, నేర చరిత్ర ఉన్న వారి అనుమానిత ఇళ్లలో సోదాలు చేశారు. నంద్యాల పట్టణంలోని దేవనగర్ ప్రాంతంలో సరైన పత్రాలు లేని 49 వాహనాలు సీజ్ చేశారు. ఆత్మకూరు పరిధిలో ఏఎంబీ పాలెం, గొల్లపేట, కొట్టాల చెరువు గ్రామాలలో 20 లీటర్ల నాటు సారాయి సీజ్ చేసి ఒకరిపై కేసు నమోదు చేశారు. నందికొట్కూరు లోని షికారిపేటలో 30 లీటర్ల నాటుసారాయి, 500 లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేశారు. అలాగే నందికొట్కూరు రూరల్ పరిధిలో లక్ష్మాపురం గ్రామంలో 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్ 'కర్నూలు'

కర్నూలు (టౌన్)/ కదిరి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణం ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన 54వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కర్నూలు జట్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. మొత్తం 16 జట్లు ఈ టోర్నీలో పాల్గొన్నాయి. ఆదివారం టోర్నీ ముగిసింది. ప్రథమ స్థానం కర్నూలు, ద్వితీయ స్థానం పశ్చిమగోదావరి, తృతీయ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు నిలిచాయి. విజేత జట్టుకు సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు ప్రసాద్ ట్రోఫీని ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహేష్‌తో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

మూగ వేదన.. అరణ్య రోదన!

నల్లమలలో వన్యప్రాణులు విలవిల

- అడవిలో నీటి చుక్క కరువు
- ఎండిన కుంటలు, వాగులు
- నీటి తొట్టెలు నిర్మించినా అరకొర నీరే!
- జనావాస ప్రాంతాలకు వస్తున్న వన్యప్రాణులు
- చోద్యం చూస్తున్న అటవీ అధికారులు



అహోబిలం రిజర్వు ఫారెస్ట్



ఎండిపోయిన అడవి



దప్పిక తీర్చుకునేందుకు వచ్చి ఉచ్చులో చిక్కుకుని మృతి చెందిన చిరుత (ఫైల్)

ఆళ్లగడ్డ: మండే ఎండలతో ప్రజలే దాహంతో అల్లాడుతున్నారు. నల్లమల అడవిలో వన్యప్రాణులదీ ఇదే పరిస్థితి. అటవీ ప్రాంతంలో నీటి నిల్వలు తగ్గడంతో జనావాస ప్రాంతాలకు వస్తూ ప్రాణాలను కోల్పోతున్నాయి. వేసవిలో సాసర్ పిట్లు(నీటి తొట్టెలను) నింపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదు.

నల్లమలలో జంతువులు ఇవీ..

దేశంలోనే అతి పెద్ద అభయారణ్యం నల్లమల. ఇక్కడ ఎన్నో రకాల వన్యప్రాణులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో అటవీ భూభాగం 1.60 లక్షల హెక్టార్లలో ఉంది. గుండ్లబ్రహ్మేశ్వరం, బండిఆత్మకూరు, నంద్యాల, చెలమ, రుద్రవరం, ఆత్మకూరు, బైర్లూటి, నాగలూటి, శ్రీశైలం, వెలుగోడు అటవీ రేంజ్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో 65 బీట్లు, 44 సెక్షన్లు ఉన్నాయి. అడవిలో చిరుతలు, పెద్దపులులు, ఎలుగుబంట్లు ఎక్కువగా ఉన్నాయి. అలాగే రేసు కుక్కలు, అడవి పిల్లులు, చుక్కల దుప్పులు, అడవి పందులు, కృష్ణ జింకలు, కుందేళ్లు, అడవి గొర్రెలు, నక్కలు కనిపిస్తాయి. బట్టమేక, అడవి కోళ్లు, నెమళ్లతో పాటు వందలాది పక్షి జాతులకు నల్లమల ఆవాసం. వర్షాభావం వెంటాడటం, ఎండ తీవ్రత పెరగడంతో కుంటలు, వాగులు ఎండిపోయాయి. జలవనరుల్లో నీటి జాడ కనుమరుగైంది. అడవిలో చాలా చోట్ల తేమ సైతం ఆవిరైంది. ఇదే వన్యప్రాణుల పాలిట శాపమవుతోంది.

సాసర్లు నింపరు!

నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో వన్యప్రాణుల దాహం తీర్చేందుకు 450కి పైగా సాసర్ పిట్లు ఏర్పాటు చేశారు. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు 5 నెలలు నిరంతరం పర్యవేక్షిస్తూ సాసర్ పిట్లలో నీరు నింపాల్సి ఉంది. అయితే ఈ ఏడాది నిధుల కొరతతో చాలాకాలంగా నీరు నింపడంలేదన్నట్లు తెలుస్తోంది. కొందరు క్షేత్ర స్థాయి అధికారులు అడపాదడపా అక్కడక్కడా దాతల సాయంతో, సొంతంగా ఖర్చు చేసుకొని వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో దప్పిక తీరడంలేదు. అనేక చోట్ల సాసర్ పిట్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. చెత్తాచెదారంతో నిండిపోయి ఉన్నాయి.



మిట్టపల్లె బీట్‌లో శిథిలావస్థలో సాసర్ పిట్

నీటి కోసం వచ్చి.. ప్రాణాలు విడిచి

అడవిలో నీటి వనరులు ఎండిపోవడం, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాసర్ పిట్లలో నీరు నింపకపోవడంతో మూగ జీవాలు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఈ సమయంలో వాహనాలు ఢీకొని ప్రాణాలు వదులుతున్నాయి. అలాగే విద్యుదాఘాతానికి గురై, వేటగాళ్ల ఉచ్చులో చిక్కి మృత్యువాత పడుతున్నాయి.

- ఈ మధ్య కాలంలో నీటికోసం వస్తున్న మూగజీవాలను వేటగాళ్లు నీటిలో విషపు గుళికలు వేసి చంపేస్తున్నారు.
- రుద్రవరం, చెలమ అటవీ రేంజ్‌ల పరిధిలో వేటగాళ్లు పెట్రేగి పోతున్నారు. ఉచ్చులు వేసి వణ్యప్రాణులను వేటాడి వాటి మాంసాన్ని, శరీర భాగాలను విక్రయిస్తున్నారు.
- ఇటీవల పెద్దకంబలూరు సమీపంలో వేటగాళ్లు వేసిన ఉచ్చులో చిక్కుకుని పెద్దపులి మృతి చెందిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది.
- మూడు నెలల క్రితం అహోబిలం సమీపంలో కారుపై పెద్దపులి దాడి చేసింది. ఆ సమయంలో గాయాలై అడవిలోకి వెళ్లి పోయింది.
- ఈ నెల 6వ తేదీ రుద్రవరంలో ఇద్దరు వ్యక్తులు వన్యప్రాణుల మాంసం విక్రయిస్తుండగా అటవీ అధికారులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.
- 2019లో బాచిపల్లె తండా సమీపంలో పెద్దపులి కళేబరం కనిపించింది. అదే సంవత్సరం ఓ పెద్ద పులి మిట్టపల్లె సమీపంలోని ఎర్రచెరువు కాల్వలో మృతి చెంది కనిపించింది.
- గండ్లేరు రిజర్వాయరులో వేర్వేరు సంఘటనల్లో రెండు చిరుత కళేబరాలు కనిపించాయి.
- 2018లో బాచిపల్లె తండా, అహోబిలం మధ్యన రెండు ఎలుగుబంట్ల కళేబరాలు కనిపించాయి.
- ఆళ్లగడ్డ సమీపంలో కృష్ణజింక వేటకు బలైంది.
- రుద్రవరం సమీపంలో ఐదు నెమళ్లు వేటగాళ్ల ఉచ్చుకు బలయ్యాయి.
- గాజులపల్లి – బొగద మధ్య రైలు పట్టాలపై రెండు చిరుత పులులు మృతి చెందాయి.

ఇలా చేస్తే ఎంతో మేలు..

బండిఆత్మకూరు, చెలమ, రుద్రవరం రేంజ్ పరిధిలో సాసర్ పిట్లకు ప్రతి రోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి. కొన్ని ప్రాంతాల్లో చెలమలను తవ్వి మూగజీవాలకు నీటి సౌకర్యాన్ని అందించాలి. అదేవిధంగా చెక్ డ్యామ్స్ ఏర్పాటు చేసి వాటి వద్ద నీటి నిల్వలను ఉంచాలి. సాసర్ పిట్ల వద్దకు నీటి కోసం వచ్చిన జంతువుల కోసం ఉప్పు ముద్దలను ఏర్పాటు చేయాలి. మూగ జంతువులు ఉప్పు ముద్దను నాకడంతో వడదెబ్బ బారి నుంచి కాపాడుకునే అవకాశం ఉంది.



అహోబిలం అడవిలో రోడ్డు వెంబడి తొట్లు పెట్టి నీరు పోస్తున్న సమాజ సేవకుడు

చర్యలు తీసుకుంటాం



సాసర్ పిట్లలో నీరు నింపుతున్నాం. ఎక్కడైనా నీరు లేదంటే సిబ్బంది చూడక పోవడమో, మరచిపోవడమో ఉంటుంది. వెంటనే నీటిని నింపేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీపతి నాయుడు, రుద్రవరం అటవీ రేంజ్ అధికారి

కుంటలు ఎండిపోయాయి



అహోబిలం అటవీ పరిధిలో చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. వన్యప్రాణులు నీటి కోసం పొలాల్లోకి, గ్రామాల్లోకి వస్తున్నాయి. అవి దాడి చేస్తాయోనని ప్రజలు భయపడుతున్నారు.

– నాసారి వెంకటేశ్వర్లు, ఏకలవ్య ఎరుకలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అందరి బాధ్యత



నల్లమల అభయారణ్యం రాయలసీమకు మాణిక్యం లాంటిది. అందులోని వన్యప్రాణులను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉంది. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఏర్పాట్లు చేయాలి.

– గజ్జల రాఘవేంద్రారెడ్డి, ఎంపీపీ

యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(అర్బన్): వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ప్రభుత్వం అందజేస్తున్న పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. ఆదివారం స్థానిక టెక్కె మార్కెట్‌యార్డులో రైతులకు యంత్ర పరికరాలు రాయితీపై పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రభుత్వం మద్దతు ధర కింద క్వింటా జొన్నలు రూ.3,371తో రైతుల నుంచి కొనుగోలు చేస్తుందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఏఓ మురళీకృష్ణ మాట్లాడుతూ నంద్యాల మండలంలో 49 మంది రైతులకు, గోస్పాడు మండలంలో 35 మంది రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, రోటావేటర్లు, విత్తన గొర్రులు, గుంటికలు అందజేశామన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మెంబర్ తులసిరెడ్డి, ఏడీఏ రాజశేఖర్, సివిల్ సప్లయ్ డీఎం రాజునాయక్, మార్క్‌ఫెడ్ డీఎం హరినాథరెడ్డి, ఏఓ ప్రసాదరావు, స్వప్నికారెడ్డి, నంద్యాల మండల ఎంపీపీ శెట్టి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



రైతుకు విత్తనపు గొర్రును పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్, అధికారులు

మహిళల రక్షణకు శక్తియాప్

బొమ్మలసత్రం: మహిళలు, బాలికల రక్షణ కోసమే శక్తి యాప్‌ను అందుబాటులోకి తెచ్చామని జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా తెలిపారు. మహిళలు తమ మొబైల్ ఫోన్‌లలో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆదివారం జిల్లాలోని బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, హాస్టళ్లు, పార్కులు తదితర ప్రాంతాల్లో పోలీసులు శక్తి యాప్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వ్యక్తిగత భద్రత గురించి మహిళలకు అవగాహన కల్పించారు. జిల్లాలో 5 శక్తి టీమ్‌లు అనునిత్యం పనిచేసేలా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

ఉరిమిన వర్షం.. పిడుగులా నష్టం

- కల్లాల్లో ధాన్యం తడిచిన వైనం
- నేలవాలిన బొప్పాయి, మామిడి వృక్షాలు
- పిడుగుపాటుతో ముగ్గురు మృతి



బండిఆత్మకూరు మండలం లింగాపురంలో తడిచిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

కర్నూలు(అగ్రికల్చర్): ఉరుములు, మెరుపులు, పిడుగులు, భారీ గాలులతో ఉన్నట్టుండి ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షం రైతులను నిలువునా ముంచింది. అన్నదాతలకు తీవ్ర నష్టం మిగిల్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదు చోట్ల పిడుగుపాటు సంఘటనలు చోటు చేసుకోగా.. ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మూగజీవులు సైతం మృత్యువాత పడ్డాయి. అకాల వర్షంతో కల్లాల్లో ఉన్న వరి ధాన్యం తడిచిపోయింది, పెనుగాలుల తీవ్రతకు అరటి, బొప్పాయి, మామిడి వంటి పంటలకు భారీ నష్టం వాటిల్లింది.

నష్టం ఇలా..

- బనగానపల్లె మండలంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలవాలింది. అకాల వర్షం తమను నిండా ముంచిందని రైతులు అవేదన వ్యక్తం చేశారు. పసుపల పరిసర ప్రాంతాల్లో కల్లాల్లోని మొక్కజొన్న తడిచిపోయింది.
- కొలిమిగుండ్ల మండలంలో కొద్ది రోజుల్లో అరటి గెలలను కోయాల్సిన తరుణంలో అకాల వర్షం దెబ్బతీసింది. మిరప కోత కోసి ఆరబెట్టుకోగా పూర్తిగా తడిచి పోయింది.
- సంజామల మండలంలో రబీలో వేసిన మొక్కజొన్న, మిరప, వరి తదితర పంటలు నూర్పిడి దశలో ఉన్నాయి. అకాల వర్షంతో పంట తడిచిపోయింది.
- బేతంచెర్ల మండలంలో గాలివానకు మామిడి కాయలు రాలిపోవడంతో రైతులు నష్టపోయారు.
- పాణ్యం మండలంలో అరటి, మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారు.
- బండి ఆత్మకూరు మండలంలో వరి పైరు నేలవాలడంతో గింజలు రాలిపోయాయి. దీంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు.
- కోవెలకుంట్ల మండలంలోని గుళ్లదూర్తి, కలుగొట్ల, రేవనూరు, లింగాల, వల్లంపాడు, చిన్నకొప్పెర్ల, తదితర గ్రామాల రైతులు వడ్లు, మిరప, మొక్కజొన్న దిగుబడులను కల్లాలు, పొలాల్లో ఆరబోసుకున్నారు. భారీ వర్షం కావడంతో పట్టలు కప్పినా నీరు కిందకు చేరి దిగుబడులు తడిచిపోయాయి.

విషాదం

కొతాళం మండలం కాత్రికి గ్రామంలో పిడుగు పడి యువకులు అశోక్(21), బాలయ్య (22) మృతి చెందారు. అలాగే నిరుపాధి, గంగాధర్ తీవ్రంగా గాయపడ్డారు. క్రికెట్ ఆడుతుండగా ఒక్కసారిగా గాలివాన మొదలై వర్షం ఎక్కువ కావడంతో సమీపంలోని చెట్టు కిందకు చేరుకోవడంతో పిడుగు పడి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

- కృష్ణగిరి మండలం కటారుకొండ గ్రామంలో పొలానికి వెళ్లిన బోయ శ్రీనివాసులు అనే రైతు పిడుగుపాటు పడి మృతి చెందారు.

బంగినపల్లి మిలమిల

- నెల ఆలస్యంగా మార్కెట్‌లోకి..
- ఊరిస్తున్న దిగుబడులు
- ఆశించిన ధరలు లేక రైతులు, వ్యాపారుల ఆందోళన

బనగానపల్లె: ఏటా వేసవిలో అందరిని ఊరించే బంగినపల్లి బేనిషా మామిడి మార్కెట్‌లో మిలమిల మిరుస్తోంది. జూన్ 15 వరకు మార్కెట్‌లో మామిడిదే పైచేయి. చిన్న పిల్లల నుంచి వయోవృద్ధుల వరకు సంపన్నులైనా.. సామాన్యులైనా మామిడి పండు రుచిని ఆస్వాదించాల్సిందే. బంగినపల్లి బేనిషా మామిడి రకం అంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న డిమాండే వేరు. గత 15 రోజులుగా మార్కెట్‌లో పసుపు పచ్చగా బేనిషా పండ్లు ఊరిస్తున్నాయి. ఉద్యానవనశాఖ అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 9,980 ఎకరాల్లో ఈ రకం మామిడి తోటలు విస్తరించాయి. ఏటా సగటున 51,896 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. వాతావరణ పరిస్థితులను బట్టి సరాసరి మెట్రిక్ టన్ను స్థానికంగా ఉన్న వ్యాపారులు రూ.70 వేల నుంచి రూ. లక్ష వరకు డిమాండ్‌ను బట్టి విక్రయిస్తూ ఉంటారు. ఈ సంవత్సరం జనవరిలో మామిడి పంటను తేనే మంచు పురుగు ఆశించడంతో కొంత మేర నష్టం వాటిల్లింది. మామిడితోటల రైతులు యాజమాన్య చర్యలు చేపట్టడంతో చీడపీడలు తగ్గుముఖం పట్టాయి. కాగా మార్చి 15న మామిడి దిగుబడి మార్కెట్‌లోకి రావాల్సివుండగా నెల అలస్యంగా ఏప్రిల్ 15 నుంచి మొదలైంది. దిగుబడి ఆశాజనకంగానే ఉన్నట్లు తోటల యజమానులు చెబుతున్నారు. కాగా ప్రస్తుతం మార్కెట్‌లో బేనిషా మామిడి కిలో రూ. వందకు విక్రయిస్తుండగా, వంద మామిడి పండ్లు రూ.4–5 వేలకు విక్రయిస్తున్నారు. 20 మామిడి పండ్లు అదనంగా ఇస్తారు. అయితే గతేడాది వంద పండ్లు రూ. ఐదారు వేలకు పైగా ధర పలికింది. ఈ ఏడాది రూ. 4 నుంచి 5 వేల లోపు ధర ఉండటంతో వ్యాపారులు, తోటల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చెట్టు నిండా కనిపిస్తున్న బేనిషా మామిడి కాయలు

విదేశాలకు ఎగుమతి..

జిల్లాలో బంగినపల్లి బేనిషా రకం తోటలు దాదాపు పది వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ముఖ్యంగా డోన్ పరిధిలో 2,439, బనగానపల్లె 650, వెల్దుర్తి 892, బేతంచెర్ల 587, ప్యాపిలి 805, కల్లూరు 496, ఓర్వకల్లు 1,122 కోడుమూరు 239, వెలుగోడు 214, రుద్రవరం 215 ఇంకా ఇతర ప్రాంతాల్లోనూ సాగులో ఉంది. చాలా వరకు బనగానపల్లె, డోన్, ప్యాపిలి, యంబాయి ప్రాంతాల్లోని ఈ రకం తోటల దిగుబడులకు మంచి డిమాండ్ ఉందని వ్యాపారులు చెబుతున్నారు. విదేశాలకు ఎక్కువగా ఈ ప్రాంత పండ్లను వ్యాపారులు ఎగుమతి చేస్తారు. ముందుగానే తోటల యజమానులతో ఒప్పందం చేసుకున్న వ్యాపారులు రెండు నెలల కాలంలో దిగుబడిని సేకరించి సమీపంలోని ఓడరేవు, ఎయిర్‌పోర్టు ద్వారా విదేశాలకు తరలిస్తారు.



బనగానపల్లె మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న బేనిషా మామిడి

నవాబుల పాలనలో బీజం..

బనగానపల్లె సంస్థానాన్ని పాలించిన నవాబులు బేనిషా మామిడితోటల పెంపకానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. మామిడి పండ్లలో బేనిషా రకాన్ని రాజుగా, మల్‌గువా రకం మంత్రిగా, దిల్‌పసన్ రకం సేనానిగా పిలువ బడుతాయి. ఈ పేర్లను బట్టి బంగినపల్లి మామిడికి ఎంత ప్రాముఖ్యత ఉందో చెప్పవచ్చు. ఇక్కడి భూములు మామిడితోటల పెంపకానికి అనుకూలంగా ఉండడంతో నవాబుల ప్రత్యేకంగా బావులు తవ్వించి తోటమాలీలను ఏర్పాటు చేసి తోటలను విస్తరించారు. ఇప్పటికీ నవాబులు పెంచిన రకం తోటల పండ్లను ఏటా స్థానికులు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన బంధువులు, కుటుంబీకులు, స్నేహితులు, ఉద్యోగులకు పంపడం ఆనవాయితీగా మారింది.బంగినపల్లి బేనిషా మామిడి పండ్లు తోలు పలుచగా ఉండి, విత్తనం వరకు తియ్యగా ఉంటుంది. 10–15 రోజుల పాటు నిల్వ ఉంచినా చెడిపోదు. నాణ్యతగా ఉండి రుచి అద్భుతంగా ఉంటుంది.


మేలో పూర్తి స్థాయిలో దిగుబడి



జనవరి నెలలో ఈ పంట పూత దశ ఉన్న సమయంలో తేనే మంచుపురుగు ఆశించి కొంత మేర దెబ్బ తిన్నా సస్యరక్షణ చర్యలతో దిగుబడి ఆశాజనకంగానే ఉంది. వారం రోజులుగా దిగుబడి లభిస్తుండగా మే నెలలో పూర్తి స్థాయిలో దిగుబడి మార్కెట్‌కు చేరుతుంది.

– అబ్దుల్ హమీద్, మామిడి తోటల యజమాని, బనగానపల్లె

గతేడాది కంటే తక్కువ ధర




గతేడాది వంద మామిడి పండ్లు రూ. ఐదారు వేల వరకు విక్రయించగా ఈ సంవత్సరం రూ. నాలుగైదు వేలకు మించడం లేదు. పండ్లు నాణ్యతగా ఉన్నాయి. వ్యాపారం కూడా పదిరోజుల్లో ఊపందుకుంటుందని అనుకుంటున్నాం. బంగినపల్లి రకం రుచి అద్భుతంగా ఉంటుంది.

– ఖాదర్‌వలి, పండ్లవ్యాపారి, బనగానపల్లె



నీరు ఉండే ప్రాంతంలో చేపల కోసం కొంగల నిరీక్షణ



చేపల కోసం వేట

విదేశీ పక్షులకు ఆతిథ్యం ఆత్మీయం

కొన్ని తెల్ల కొంగలు.. మరికొన్ని నల్ల కొంగలు తుంగభద్రా నదీ తీరంలో సందడి చేస్తున్నారు. నల్ల కొంగలు విదేశాల నుంచి విహరిస్తూ వచ్చాయి. వీటితో తెల్ల కొంగలు కలిసి సంచరిస్తున్నాయి. తుంగభద్ర నదిలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే గుంతల్లో నీరు కనిపిస్తోంది. ఆ నీటిలో చేపలను వేటాడేందుకు ఇవి గుంపులుగా నిరీక్షిస్తున్నాయి. కర్నూలు జిల్లాలో దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



నదిలో నీరు ఉండే ప్రాంతంలో విదేశీ పక్షులు

క్లుప్తంగా

హంతకులను తక్షణమే అరెస్టు చేయాలి

- సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చిప్పగిరి లక్ష్మీనారాయణను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి ఎన్. రఘువీరారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు, అనంతపురం జిల్లాల ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. కాగా.. లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను ఎన్.రఘువీరారెడ్డితో పాటు కర్నూలు జిల్లా కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి అంబటి రామకృష్ణ యాదవ్ ఫోన్‌లో మాట్లాడి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పరిపాలనాధికారిగా పదోన్నతి



జీఎన్‌ఎస్ ప్రసాద్

కర్నూలు(అర్బన్): జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ జిల్లాల పునర్విభజనలో నంద్యాలకు వెళ్లిన జీఎన్‌ఎస్ ప్రసాద్‌కు పరిపాలనాధికారిగా పదోన్నతి లభించింది. జోన్-4లో జరిగిన పదోన్నతుల్లో భాగంగా ప్రసాద్‌ను శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండ డీఎల్‌పీఓ కార్యాలయానికి పోస్టింగ్ ఇస్తూ పీఆర్‌అండ్‌ఆర్‌డీ డైరెక్టర్ వీఆర్ క్రిష్ణతేజ మైలవరపు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాద్‌కు పరిపాలనాధికారిగా పదోన్నతి లభించడంపై జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ ఉద్యోగులు, సహచరులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

గోస్పాడు: పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా గోస్పాడు ఎస్‌ఐ వెంకటప్రసాద్ పట్టుకున్నారు. బియ్యం బస్తాలతో బనగానపల్లె వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని మండలంలోని రాయపాడు గ్రామ సమీపంలో గుర్తించి తనిఖీలు చేపట్టారు. మొత్తం 16 బస్తాల బియ్యం ఉండటంతో ఆ వాహనాన్ని సీజ్ చేసి బనగానపల్లెకు చెందిన వంశీ, హుసేని, గిరి అనే వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరుముల శబ్దానికి వృద్ధుడి మృతి



బాషా సాహెబ్ (ఫైల్)

ప్యాపిలి: పట్టణంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. పట్టణంలోని బాలికల వసతి గృహం సమీపంలో నివాసం ఉంటున్న మసాలా బాషా సాహెబ్ (70) ఇంటి వసారాలో కూర్చుని ఉండగా ఒక్కసారిగా ఉరుముల శబ్దం వచ్చింది. ఉరుముల శబ్దంతో గుండెపోటుకు గురైన ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎర్రమట్టి ట్రాక్టర్ల పట్టివేత



సి.బెళగల్‌లో పోలీసులు సీజ్ చేసిన ఎర్రమట్టి ట్రాక్టర్లు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లో అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. శనివారం రాత్రి మండలంలోని గ్రామాల్లో వారు గస్తీ నిర్వహిస్తుండగా నిషిద్ధ ప్రాంతమైన సి.బెళగల్ పచ్చిక బయళ్లు ఉన్న కొండ నుంచి ఎర్రమట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు కనబడ్డాయి. వాటిని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సమస్యలపై ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన బాట

- ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో నేడు, రేపు డిపోల ఎదుట దీక్షలు

కర్నూలు సిటీ: తమ సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన బాటకు సిద్ధమయ్యారు. ఉద్యోగుల భద్రత కోసం జారీ చేసిన సర్క్యులర్ 1/2019 అమలు, మహిళ ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవుల మంజూరు, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానం కొనసాగింపు, 114 జీఓలో పొందుపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్స్‌లు రూ.150 నుంచి రూ.400కు పెంపు, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలు కేటాయింపు ఇలా వివిధ డిమాండ్ల సాధనకు ఉద్యమించనున్నారు. ఇందులో భాగంగా నేడు, రేపు రెండురోజుల పాటు నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట దీక్షలు చేపట్టనున్నారు.

కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



సమావేశంలో పాల్గొన్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కురువ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించేందుకు తీర్మానించినట్లు జిల్లా కురువ సంఘం నేతలు తెలిపారు. ఆదివారం సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షులు కే కిష్టన్న, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, ప్రధాన కార్యదర్శి అనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 500 మార్కులకు పైగా, ప్రైవేటు పాఠశాలల్లోని వారు 550కి పైగా మార్కులు వచ్చిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో చదివిన వారు 850 మార్కులకు పైగా, ప్రైవేటు కళాశాలల్లో చదివిన విద్యార్థులు 900కి పైగా మార్కులు తెచ్చుకున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థులు తమ మార్కుల మెమో, కులం సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను మే నెల 5వ తేదీలోగా సెల్: 9440756199, 9032741194 నెంబర్లకు వాట్సాప్ పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీ వెంకటేశ్వర్లు, కే ధనుంజయ, కేసీ నాగన్న, తిరుపాల్, తవుడు శ్రీనివాసులు, పాల సుంకన్న, బీసీ తిరుపాలు, పుల్లన్న, బాలరాజు, కే మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నేడు కర్నూలులో ముస్లింల శాంతి ర్యాలీ



మాట్లాడుతున్న సయ్యద్ జాకీర్, ఎంఏ హమీద్

కర్నూలు(సెంట్రల్): వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని కోరుతూ సోమవారం కర్నూలులో ముస్లింలు భారీ శాంతి ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ర్యాలీకి మతాలు, కులాలకు అతీతంగా రాజకీయ పార్టీలు, వివిధ ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని సేవ్ వక్ఫ్..సేవ్ రాజ్యాంగం జేఏసీ కన్వీనర్ సయ్యద్ జాకీర్ అహ్మద్, కోకన్వీనర్ ఎంఏ హమీద్ కోరారు. ఆదివారం వక్ఫ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..ఉదయం 9 గంటలకు ఉస్మానియా కాలేజీ నుంచి ర్యాలీ ప్రారంభమై వడ్డేగేరి, చిల్డ్రన్స్ పార్కు మీదుగా రాజ్ విహార్ చేరుకుంటుందన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలు రాజ్‌విహార్ చేరుకొని అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వస్తాయని చెప్పారు. ర్యాలీలో ప్రభుత్వాలకు ఎవరూ వ్యతిరేకంగా నినాదాలు చేయరాదని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు యూనస్‌బాషా, సీపీఎం నాయకుడు ఎస్‌ఎండీ షరీఫ్, బీఎస్పీ నాయకులు సలీం, జైరాజ్, బుర్రన్న, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



అపూర్వ కలయిక

గురువులతో పూర్వపు విద్యార్థులు

గోస్పాడు హైస్కూల్‌లో 2004–2005లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 20 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారికి విద్య నేర్పిన గురువులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, మురళీకృష్ణ, సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వసుమతి, కృష్ణ, వెంకటసుబ్బయ్యలను ఆహ్వానించి శాలువ, పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆవుల కాంతారెడ్డి, మల్లికార్జున, అంకన్న, సుబ్బయ్య, సురేష్, నాగరాజు, పవన్ కుమార్‌రెడ్డితో పాటు మరికొంత మంది రక్తదానం చేశారు. – గోస్పాడు

విజ్ఞానం.. వినోదం

- జిల్లా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన ప్రత్యేక శిబిరాలు
- వైజ్ఞానిక, సాంస్కృతిక, సృజనాత్మక కళారంగాలపై ప్రత్యేక శిక్షణ
- నేటి నుంచి ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయ శాఖల్లో శిక్షణ శిబిరాల నిర్వహణ



జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ

కర్నూలు కల్చరల్: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థతో పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని శాఖ గ్రంథాలయాల్లో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ పేరుతో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. వేసవి సెలవుల్లో విద్యార్థులు పలు అంశాలపై అవగాహన పెంపొందించుకునేందుకు లైబ్రరీల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది. వివిధ పోటీలను నిర్వహిస్తూ పిల్లల మానసికోల్లాసానికి తోడ్పాటునందిస్తోంది.

గ్రంథాలయాలు వేదికగా..

వేసవి సెలవుల్లో పిల్లలకు విజ్ఞానంతో కూడిన శిక్షణ అందించేందుకు గ్రంథాలయాలను వేదికగా శిబిరాలను నిర్వహించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో ఈనెల 28 నుంచి ప్రారంభమై జూన్ 6వ తేదీ వరకు విజ్ఞాన శిబిరాలు కొనసాగనున్నాయి. 10 నుంచి 15 ఏళ్ల లోపు బాలబాలికలు (6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు) ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. ప్రతి గ్రంథాలయానికి సమీప ప్రాంతంలోని విద్యార్థులను గ్రంథాలయాలకు వచ్చేలా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా పిల్లలకు విజ్ఞానం పెంపొందించేలా, మానసిక వికాసానికి సంబంధించిన ఆటపాటల ద్వారా క్యాంప్‌లను నిర్వహించనున్నారు. ఒక్కో గ్రంథాలయంలో కనీసం 30 నుంచి 60 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. టీచర్లు, అధ్యాపకులు, విద్యావేత్తలు, మేధావులు, విశ్రాంత ఉద్యోగులను పిలిపించి వారి అనుభవాలను పిల్లలకు వివరించేలా చర్యలు తీసుకోనున్నారు. స్వచ్ఛందంగా వచ్చే వారి సహకారాన్ని తీసుకొని విద్యార్థులకు బోధించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సమ్మర్ క్యాంప్ ముఖ్య లక్ష్యాలు:

- పిల్లల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించుట.
- పిల్లల్లో చదివే అలవాటు పెంపొందించడం, వినే నైపుణ్యం పెంపొందించడం.
- పాఠశాల వయసు పిల్లలను గ్రంథాలయాలకు వచ్చేలా అలవాటు చేయడం.
- జిల్లాలోని గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో సృజనాత్మకత పెంపొందేలా తర్ఫీదు ఇవ్వనున్నారు. ముఖ్యంగా కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక ప్రక్రియలను నిర్వహిస్తున్నారు.

సమ్మర్‌క్యాంప్ నిర్వహణ ఇలా...

- ఉదయం 8 నుంచి 8.30 వరకు కథలు వినడం (వినికిడి విజ్ఞానం పెంపొందించడం)
- 8.30 నుంచి 9.30 వరకు గ్రంథాలయంలోని పుస్తకాలను చదవటం (చదువంటే మాకిష్టం)
- 9.40 నుంచి 10 వరకు పుస్తక సమీక్ష
- 10 నుంచి 10.30 వరకు కథలు చెప్పడం
- 10.30 నుంచి 11 వరకు స్పోకెన్ ఇంగ్లిష్/ డ్రాయింగ్/పెయింటింగ్/పేపర్ క్రాఫ్ట్/ పప్పెట్
- మేకింగ్/డ్యాన్స్/చెస్/క్యారమ్స్/క్విజ్/జీకే తదితర అంశాల్లో శిక్షణ

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి. పిల్లలు తమ ప్రజ్ఞా పాటవాలను పెంపొందించుకునేందుకు ఈ శిబిరాలు ఉపయోగపడతాయి. ఆ మేరకు తల్లిదండ్రులు సైతం పిల్లలను ప్రోత్సహించాలి. అధిక సంఖ్యలో పిల్లలు క్యాంప్‌ల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నాం.
– కె. ప్రకాష్, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ

నిరాశ పరిచిన డీఎస్సీ నోటిఫికేషన్

ఆదోని సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ చాలా మంది నిరుద్యోగులను నిరాశ పరిచిందని ఆదోని పట్టణానికి చెందిన నిరుద్యోగి సూరిపోగు లోకేష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాను ఆదోని పట్టణంలోని బీఎస్సీ ఎంపీసీఎస్, బీఈడీ పూర్తి చేశానని, మెథడాలజీ ఫిజికల్ సైన్స్ మెథడాలజీ టూ ఇంగ్లిష్‌లో పూర్తి చేశానని తెలిపారు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన టెట్ నోటిఫికేషన్‌లో పరీక్షరాయడానికి అవకాశం కల్పించారని, దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్‌లోకి వెళితే బీఎస్సీ ఎంపీసీఎస్ మెథడాలజీ వన్ ఫిజికల్ సైన్స్ మెథడాలజీ టూ ఇంగ్లిష్ పూర్తి చేసిన వారికి ఆప్షన్ చూపించడం లేదన్నారు. రాష్ట్రంలో బీఎస్సీ ఎంపీసీఎస్ చేసిన తనలాంటి నిరుద్యోగులు ఎంతోమంది నష్టపోతున్నారని వాపోయాడు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవడానికి మే నెల 15వ తేదీ వరకు అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నోటిఫికేషన్‌లో ఉన్న లోపాలను సరిదిద్ది మాలాంటి వారికి అవకాశం కల్పించాలని కోరారు.

మత్స్యకారులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు బెస్త శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న బెస్త శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మత్స్యకారులను తీవ్రంగా మోసం చేస్తున్నదని జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు బెస్త శ్రీనివాసులు తీవ్రంగా ఆరోపించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ జిల్లాలకు మత్స్యకార భరోసా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేది వరకు 61 రోజుల పాటు రాష్ట్రంలో చేపల వేట జరగకుండా వెయిటర్ నిషేధం విధించిన సమయంలో రాష్ట్రంలోని మత్స్యకారులందరికీ భృతి చెల్లించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. అయితే ఇంగ్లాండ్‌చెరువులపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో భృతి చెల్లించకపోవడం దారుణమన్నారు. రాయలసీమలోని మత్స్యకార సొసైటీలు కూడా చేపల పెంపకానికి చెరువులకు పన్ను చెల్లిస్తున్నప్పుడు మత్స్యకార భరోసాకు వారు ఎందుకు అర్హులు కారని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని విడనాడి అందరికీ న్యాయం చేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు రాజకీయంగా పెద్ద పీట వేశారని, ఒక రాజ్యసభ, ఒక మంత్రి, నాలుగు ఎమ్మెల్సీలు, నాలుగు పార్టీ జిల్లా అధ్యక్ష పదవులు, బ్యాంకు చైర్మన్, కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు తదితర అనేక పదవులు ఇచ్చారని శ్రీనివాసులు గుర్తు చేశారు. నేడు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తు ప్రాంతాల వారీగా మత్స్యకారులను విడదీసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటి వరకు మత్స్యకారులను కూటమి ప్రభుత్వం గుర్తించిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా సంప్రదాయ మత్స్యకారులు చంద్రబాబు కుటిల రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో నాయకులు బెస్త సత్యనారాయణ, ఎద్దుల వెంకటేశ్వర్లు, బెస్త కమల, తెలుగు కన్నా, నంద కిషోర్, మోహన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాని'సెల్' కాకుండా



చిన్నారులకు బారకట్ట నేర్పుతున్న వృద్ధురాలు

పిల్లలకు వేసవి సెలవులొచ్చాయి. ఆటలాడేందుకు బయటికి వెళ్లాలంటే ఎండలు మండిపోతున్నాయి. నీడలో ఆటలు ఆడేందుకు ఇష్టపడుతున్నారు. అయితే చేతిలో సెల్ ఉందని మొబైల్ గేమ్‌లు ఆడితే కళ్లకు ఇబ్బంది ఏర్పడటంతో పాటు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఇప్పటికే ఎంతో మంది చిన్నారులు సెల్‌ఫోన్ ప్రభావంతో అటు చదువులు, ఇటు ఆరోగ్యాన్ని కోల్పోతున్నారు. ఈ క్రమంలో సెలవుల్లో పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచి, ఉదయం, సాయంత్రం ఆరు బయట, మధ్యాహ్నం నీడ పాటున మిత్రులతో కలసి ఆడుకునేలా పెద్దలు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది. – మద్దికెర

ప్రాణం తీసిన విద్యుదాఘాతం



మృతదేహం వద్ద రోదిస్తున్న లక్ష్మి

సి.బెళగల్: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ కాలప్ప (40).. సి.బెళగల్ గ్రామ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కనున్న బండల డిపోలో కట్టర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం బండల డిపోలో పని చేసుకుంటుండగా వైరు పాడైపోయి ఉండటంతో రేకుల షెడ్‌కు విద్యుత్ ప్రసారం అయ్యింది. గమనించని కాలప్ప.. షెడ్ రేకులను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి భార్య లక్ష్మి సంఘటన స్థలానికి చేరుకుని రోదించిన తీరు పలువురను కంటతడి పెట్టించింది. బోయ కాలప్పకు భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విద్యుత్ తీగల నిర్వహణలో బండల డిపో యజమాని నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని మృతుడి బంధువులు ఆరోపించారు. యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

5 నుంచి రంగస్థల నటనపై శిక్షణ

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో మే 5వ తేదీ నుంచి రంగస్థల నటనపై శిక్షణ ఇస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో మే 3వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. 16 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉండి, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. నట శిక్షకులు, నాటక దర్శకులు జల్లుకుమార్ (చెన్నై)చే 5 నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారిచే 16వ తేదీన నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

పిడుగు పడి రెండు ఎద్దులు మృతి

పెద్దకడబూరు: మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో ఆదివారం పిడుగు పడి చిన్న మాదన్న అనే రైతుకు చెందిన రెండు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. బాధిత రైతు, స్థానికుల వివరాల మేరకు.. చిన్న మాదన్న ఎప్పటి లాగే (గ్రామానికి సమీపంలో ఉన్న) పొలానికి తీసుకెళ్లి అక్కడ ఎద్దులను కట్టేసి ఇంటికి వెళ్లాడు. మధ్నాహ్నం వాటిపై పిడుగు పడటంతో మృతి చెందాయి. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి బాధిత రైతుకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు వెళ్లి విగతజీవులుగా పడి ఉన్న ఎద్దులను చూసి బోరున విలపించారు. దాదాపు రూ. 1.80లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు చిన్న మాదన్న వాపోయాడు. కష్టం చేసుకుని బతికే తమకు రెండు ఎద్దులు చనిపోవడంతో చేతులు విరిగినట్లు అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.



పిడుగు పడి మృతి చెందిన ఎద్దులు

మత సామరస్యంతో మెలగాలి



ఖాదర్‌బాబును సన్మానిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: ప్రజలు మత సామరస్యంతో మెలగాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ సూచించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ విశ్రాంత సర్కిల్ అధికారి, మిమిక్రీ ఆర్టిస్ట్ ఖాదర్‌బాబు అభినందన సభ, మిమిక్రీ నాటక ప్రదర్శన, సంగీత విభావరి కార్యక్రమాలు ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగాయి. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ.. ఖాదర్ బాబు నాటక రంగంలో మల్టీటాలెంటెడ్‌గా రాణించడం అభినందనీయమన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తిఓబులయ్య, ఆర్‌ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బాలమద్దయ్య, విశ్రాంత ఎస్పీ లక్ష్మీనాయక్ మాట్లాడారు. అనంతరం ఖాదర్‌బాబు ప్రదర్శించిన నాటక సన్నివేశాలు, గాయకులు సుధారాణి, హబీబ్, బాల వెంకటేశ్వర్లు నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. కళాక్షేత్రం మాజీ అధ్యక్షుడు దస్తగిరి, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు రమణ తదితరులు పాల్గొన్నారు .

ట్రాక్టర్ కింద పడి రైతుకు తీవ్రగాయాలు

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల సమీపంలో ఆదివారం సాయంత్రం ఓ రైతు ట్రాక్టర్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. సంజామల మండలం రెడ్డిపల్లెకు చెందిన మాయలూరు నారాయణరెడ్డి వరి పొలంలో బేలర్ యంత్రంతో వరి చుట్టలు చుడుతున్న క్రమంలో యంత్రంలో వైరు కట్ అయింది. గమనించిన రైతు ట్రాక్టర్ ఇంజిన్ దిగి వచ్చి వైరును సరిచేస్తుండగా ఇంజిన్ కదలడంతో కింద పడగా వెనుక టైర్ రైతు ఛాతిపైకి ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రైతు పరిస్థితి విషమంగా ఉంది.